# ఆ లోకం నుంచి ఆహ్వానం!

ఉషారాణి భాటియా

తాయారు ఆయాసపడుతోంది. ఉండి ఉండి నాలుగు వైపులా చూస్తోంది. ఆమె తల దగ్గర చెల్లెలు కూర్చుని ఉంది. పక్కగా స్టూలుమీద భర్త కూర్చుని ఉన్నాడు. ఇతర బంధువులు, స్నేహితులు ఆమె వంక ఆదుర్దాగా చూస్తున్నారు.

డాక్టరు ఇంజక్షను ఇచ్చేందుకు రాగానే అందరూ లేచి నిలబడ్డారు. అతను సైగ చేయగానే గదిలోంచి బైటకు వెళ్ళారు. చెల్లెలు మటుకు తాయారు చేయి పైకెత్తి డాక్టరుకి సాయపడుతోంది. డాక్టరు వెళ్ళిపోయాడు. తాయారు లేవటానికి ప్రయత్నించింది. చెల్లెలి వంక ప్రేమగా, కృతజ్ఞతా పూర్వకంగా చూసింది.

"ఇదిగో కమలా, నా కోసం ఇక బాధపడకండి. మీ ప్రయత్నమంతా వృథా. నాకు ఆ లోకం నుంచి ఆహ్వానం వచ్చింది. నేను ఇక వెళ్ళాలి," అంది నెమ్మదిగా. కమల కంట్లో నీళ్ళు తిరిగాయి.

"ఊరుకో అక్కయ్యా! పిచ్చి మాటలు నువ్వూను! ఈ మందులతో నయమవుతుందనీ, ఆసుపత్రికి కూడా తీసుకెళ్ళవలసిన అవసరం లేదనీ ఇవాళే డాక్టరు చెప్పాడు," అంది అక్క నుదుటిమీద జుట్టు సర్దుతూ.

"నాకు చావు అంటే భయం లేదు కమలం! వాళ్ళు పిలుస్తున్నారు- నా పిల్లలూ, స్నేహితులూ, ఆప్తులూ అందరూనూ.." తాయారు కళ్ళు ఆశతో మెరుస్తున్నాయి.

"ఎవరు ఎదురుచూస్తున్నారు? వాళ్ళంతా గుమిగూడి ఉన్నారని నీకు ఎలా తెలుసు? ఇంతవరకు చనిపోయినవాళ్ళెవరయినా తిరిగి వచ్చి ఆ కబుర్లు చెప్పారా? పిచ్చిదానా! ఆయాసం ఎక్కువవుతుంది. నెమ్మదిగా పడుకో!" అంది చెల్లెలు దిగులు, విసుగు మిళితమైన కంఠంతో.

కానీ, తాయారు మాటలు ఆపలేదు. "అదిగో! వాళ్ళు పిలుస్తున్నారే!" అని నెమ్మదిగా అంటూనేఉంది. ఆమెకి నిద్ర వచ్చింది. ఆ మరునాడు, మరునాడు ఆమె పరిస్థితి కాస్త నయమవుతున్నట్లే కనిపించింది. కానీ నాలుగో రోజున నిజంగానే తాయారుకి ఆ లోకం నుంచి ఆహ్వానం వచ్చింది. భవబంధాలు తెంచుకుని, తన ఆప్తులనీ, బంధువులనీ కలుసుకునేందుకు ఆమె సంతోషంగా వెళ్ళిపోయింది.

* * *

తాయారు మెట్లు ఎక్కుతోంది. చాలా ఎత్తయిన మెట్లు. ఎంతసేపు ఎక్కినా తరగడం లేదు. ఆమె అలసిపోయింది. ఆగి చుట్టూ చూసింది. చిరపరిచితమైన వాతావరణం. మనుషుల మాటలు వినబడుతున్నాయి. అందులో ఒక కంఠాన్ని ఆమె తక్షణం గుర్తు పట్టింది. అత్తగారు రుక్మిణమ్మ చేతులు కళ్ళకు అడ్డు పెట్టుకుని, ఏదో వెతుకుతున్నట్టు తాయారుని సమీపించింది.

"నువ్వటే తాయారూ! వాణ్ణి ఒంటరిగా వదిలేసి వచ్చేశావా? ఏం తొందర?" అడిగింది.

ఈ మాటలు అంతకుక్రితం తాయారు చాలాసార్లు విని ఉంది. చనిపోయి మరోలోకంలోకి అడుగు పెట్టాక, అత్తగారే ఎదురు రావాలా? మునపటి నసుగుడు ప్రారంభించాలా?

అంతవరకు తాయారు మనసులో చోటు చేసుకున్న శాంతి, ఆధ్యాత్మిక చింత మాయమయ్యాయి. ఆమె ముఖం ఎఱ్ఱబడి, తనుబొమలు దగ్గరపడ్డాయి.

"ఏమే! జవాబు చెప్పవేం! వాడెలా ఉన్నాడు? వాడికి అన్నం ఎవరు వండి వారుస్తారు?" అత్తగారు గదమాయిస్తూ అడిగింది.

"వంటమనిషి, లేదా మీ కూతుళ్ళు.." అంది తాయారు కోపంగా.

"నా కూతుళ్ళు ఎందుకు చేయాలే? వాళ్ళకి వాళ్ళ సంసారాలు లేవటే? నీ బుద్ధి ఇంకా మారలేదు. అత్తన్నా, ఆడబిడ్డలన్నా తగూకి తయారు!" అంది అత్తగారు.

ఆమె కంఠం హెచ్చుస్థాయి అందుకోవడంతో దూరంగా ఉన్న కొన్ని నీడలు దగ్గిరగా రాసాగాయి.

"మీరు మటుకు నన్ను ఎలా చూశారు?" తాయారు కంట్లో నీళ్ళు తిరిగాయి.

"ఎలా చూశానా? తిండికి తక్కువయిందా? సుఖాలు తక్కువ చేశానా" గద్దించింది తాయారు.

"మీ మనసులో నిత్యం బేధభావం వుండేది. మీ కూతుళ్ళని చూసినట్లు నన్ను ఆదరించారా? చెప్పండి?" అడిగింది తాయారు.

"చెబుతానే, ఇప్పుడు చెపుతాను. ఇక్కడ నేను ఎవరికీ భయపడను. అక్కడంటావా? నలుగురూ ఆమోదించేట్లు- కూతురూ కోడలూ ఒకటే అన్నాను. పెళ్ళిలోనూ అన్నాను. ఆ తరువాత అన్నాను. కానీ ఇద్దరూ ఒకటి ఎలా అవుతారు? ఎన్నటికీ అవరు. ఈ లోకంలో గట్టిగా అరిచి చెపుతాను. నిన్ను కూతురి కింద ఎన్నడూ చూడలేదు,"

"అయ్యయ్యో!" అంటూ తాయారు చెవులు మూసుకుంది. అప్పటికి చుట్టూ చాలామంది చేరారు. అందులో ఇద్దరు స్త్రీలు తాయారు చేయి ప్రేమగా పట్టుకున్నారు.

"నేను మిసెస్ చంద్రాన్ని, నేను కమలాక్షిని, నేను మీరాని" అంటూ ఆమె చిన్ననాటి స్నేహితురాళ్ళు దగ్గిరగా వచ్చారు. తాయారు ఒక్కక్షణం అత్తగార్ని మరిచిపోయి వారివంక చూసింది. మసక మసకగా ఉన్నా వారి స్నేహ పూర్వక చూపులు తాయారుని ఆనందంలో ముంచాయి. "ఇక్కడందరూ ఇలా కలుసుకుంటారా?" అడిగింది ఆశ్చర్యంతో.

"భయపడకు! మేమంతా వున్నాము. ఎన్నాళ్ళుగానో నీలాటి స్నేహితురాళ్ళ కోసం వేచి ఉన్నాము" అన్నారు.

"ఈ గుంపు! ఇంతమంది జనం! నాకు ఊపిరాడడం లేదు. అలా ఎక్కడికైనా మూలగా వెళ్ళి కూర్చుందాం" అడిగింది తాయారు చుట్టూ కలియచూస్తూ.

"ఈ లోకంలో అలాంటి ఒంటరి స్థలాలు లేవు. ఒకరి వెనుక ఒకరు గొయ్యి తవ్వుకోవటాలూ, గుసగుసలూ లేవు. స్వేచ్ఛగా, గట్టిగా అందరూ మాట్లాడుకుంటారు. నాటకీయం లేకుండా మేము జీవిస్తాము. అందుకని మాకు భయాలు లేదు. మాకిక్కడ బాగుంది," అంది మిసెస్ చంద్రం.

"నాకు అర్థం కాలేదు?" అంది తాయారు అయోమయంగా చూస్తూ.

"విను, వివరంగా చెపుతాను. నువ్వు మమ్మల్ని ఎన్నడూ సరిగ్గా అర్థం చేసుకుని ప్రవర్తించలేదు. అక్కడ ఉన్నప్పుడు నీ డబ్బు, హోదా, సమాజంలో నీ స్థానం వీటిగురించి నీకు అక్కర ఎక్కువ. వాటి కారణంగానే ఇతరులు నీ వైపు ఆకర్షితులవుతున్నారని అపోహ పడ్డావు. మాలాటి వాళ్ళు నీకు దగ్గర కావడానికి అవే కారణం అనుకున్నావు. కానీ మేము ఎన్నడూ నీ నగలూ, చీరలూ, భర్త ఉద్యోగం- వీటిని గురించి ఆలోచించలేదు. నిన్ను నిన్నుగా అంటే తాయారుగా - ఇష్టపడి నీ స్నేహం కోరాము. నీలో ఉన్న అంతర్గత విలువలనీ, సంస్కారాన్నీ గౌరవించాము. స్నేహం, ప్రేమ అనేవాటికి ఇవి చాలు. పై వేష భూషణాలు అవసరం లేదని నువ్వు తెలుసుకోలేకపోయావు. అదే విచారించదగ్గ విషయం. నువ్వు జీవించి ఉండగా అయితేనేం, ఇక్కడయితేనేం... ఈ నాటికీ మేం నీ స్నేహం కోరుతున్నాము. తాయారు స్నేహం, సమాజంలో ఒక వ్యక్తి అయిన తాయారు స్నేహం కాదు," అంది కమల.

తాయారు చిన్నబుచ్చుకుంది. కానీ తక్షణం తన పొరపాటు తెలుసుకుని వారి వంక సాదరంగా చూసింది.

ఇంతలో మిసెస్ చంద్రం తాయారు భుజంమీద చేయివేసి గట్టిగా అడిగింది. "నేను పోయాక మండలిలో సంతాపసభ చేశారు. నువ్వూ వెళ్ళావు. నాలో కృతజ్ఞతా భావాలు పెల్లుబికాయి. కానీ అదేమిటి తాయారూ! అన్ని అసత్యాలు బహిరంగంగా చెబుతుంటే మీరంతా ఎలా వినగలిగారు? నేను సంఘసేవ చేశాననీ, మా వారితో విదేశాలకు వెళ్ళాననీ అవాకులూ, చెవాకులూ చెబుతుంటూ నాకు కోపం, నవ్వూ వచ్చాయి.. లావుగా, గద్వాల్ చీర కట్టుకుందే, అసలు ఆవిడ ఎవరు? నా చిన్ననాటి స్నేహితురాలినని ఎన్నో కబుర్లు చెప్పింది. ఆమెను నేను ససేమిరా ఎరుగను. అసలు ఈ సంతాప సభలు జరపకపోతేనేం? చేస్తే ఇలాంటి అబద్ధాలు చెప్పవలసి ఉంటుంది కదా? ఇవి ఎవర్ని తృప్తి పరచడానికి?"

"మా విషయంలోనూ ఇలాంటి అసత్యాల సభలు జరిగాయి" దూరాన్నుంచి పెద్దగా నవ్వులూ, హేళనగా

కేకలు వినపడ్డాయి.

తాయారుకి చాలా యిబ్బందిగా వుంది. ఆ సభ రోజున తనకీ వారి మాటలు చిత్రంగా తోచినమాట నిజం.. మిసెస్ చంద్రం ఏనాడూ సంఘసేవ చేసి ఎరుగదు. విదేశం మాట అటుంచి, ఆమె సింగపూర్ కూడా వెళ్ళలేదు. ఇంతలో "అమ్మా! అమ్మా" అన్న పిలుపు విని ఆమె వెనక్కి తిరిగింది. కూతురు లల్లీ నిలబడి ఉంది. తన 35వ ఏట లల్లీ కారు ప్రమాదంలో మరణించింది. ఆ షాక్ నుంచి తేరుకోవడానికి తాయారుకి చాలాకాలం పట్టింది. లల్లీ తల్లిని ఆప్యాయంగా కౌగలించుకోలేదు. కాస్త ఎడంగా నిలబడి, కుతూహలంగా ఆమెవైపు చూస్తోంది.

"నేను పోయాక అయినా పిల్లలు నీకు దూర మయారా? ఒకసారయినా వాళ్ళని పిలిచి ఆదరించలేక పోయావు! ఎందుకు? ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకున్నారని కోపం కదూ నీకు? చేసుకోలేదే అనుకో. వాళ్ళని నువ్వు పోషించే దానివా? ఓపిక ఉందా నీకు?.."

లల్లీ ప్రశ్నలకి తాయారుకి నోట మాట రాలేదు.

ఎవరి బ్రతుకు వాళ్ళు జీవించేట్టు వదిలేయడం ఎప్పుడు నేర్చుకున్నావు గనుక! ఆయన నీకేం ద్రోహం చేశారు? అయినా ఆయన కుటుంబ విషయాల్లో నీకెందుకు జోక్యం?..."

తాయారు చేయి అడ్డంగా తిప్పుతూ కూతురి మాటలు బంధించింది.

"సారీ మమ్మీ! మనసుకి కష్టం కలిగించానా? ఇలా నిర్భయంగా నిజం చెప్పడం మాకు ఇక్కడ అలవాటు," అంటూ లల్లీ తల్లికి దగ్గరగా వచ్చింది.

"అమ్మా! చిన్నప్పుడు మమ్మల్ని ఎంతో డిసిప్లిన్ చేసే దానివి- ఇది చేయకు - అలా వెళ్ళకు అంటూ. నేను పెద్దయ్యాక కూడా నీ ఈ అలవాటు పోలేదు. నాకు నీతులు బోధిస్తూ, నన్ను గుప్పెట్లో పెట్టుకో ప్రయత్నిం చావు, కానీ అమ్మా! నీకు తెలియనిది ఏమంటే నువ్వు నా మనసునీ, ఆలోచనలనీ నిరోధించలేక పోయావు. అవి స్వేచ్ఛని కోరి నీ ఆదేశాలని చాలామటుకు త్రోసిపుచ్చాయి. చాలా విషయాలు నీకు తెలియకుండానే జరిగిపోయాయి. చివరికి ఏం జరిగిందంటే నేను చేసిన అనేకం ఎవరూ కనిపెట్టలేదు. కానీ నేను చేయని అపరాధాలకి సమాజం నన్ను శిక్షించ ప్రయత్నించింది,"

తాయారు ఆశ్చర్యంతో చూస్తోంది. తను ఎంతో ముద్దుగా పెంచి, వివాహ మయ్యాక అల్లుడి అడుగులకి మడుగులొత్తి, కూతురు ఏ విధంగానూ కష్టపడకూడదని తాపత్రయపడిన తనకేనా ఈ మాటలు వినిపిస్తున్నది? బ్రతికుండగా తన కూతుర్ని అర్థం చేసుకోలేకపోయింది? కానీ ఇప్పుడు.. ఎంతో ఆలస్యమయిపోయింది.. " అనుకుంది.



కాసేపటికి దూరంగా పాటలు వినిపించాయి. స్త్రీ పురుషులు నెమ్మదిగా, శ్రావ్యంగా పాడుతున్నారు. దూరంగా వినబడుతున్న ఆ పాటలకి ఆకర్షిత అయి తాయారు నెమ్మదిగా అటువేపు అడుగులు వేసింది. కాస్త ముందుకు వెళ్ళగానే, చేతులు మోడ్చి కూర్చుని ఉన్న మనుషులు కనిపించారు. కొన్న చిర పరిచిత ముఖాలు, వాటి మధ్య తమ కుటుంబ పూజారి గౌరయ్యశాస్త్రి కూడా వున్నాడు. కానీ వాళ్ళెవరూ తాయారుని గమనించలేదు. కళ్ళు మూసుకుని నెమ్మదిగా పాడుతున్నారు.

వాళ్ళ పాటలకి అర్థం తెలుసుకుందామని, తాయారు మరికొంత దగ్గిరగా వెళ్ళి నిలబడింది. ఆమె ఆశ్చర్యానికి అంతులేదు. తాయారు బ్రతికుండగా ఎరిగున్న మత ప్రవర్తకుల, దేవీ దేవతల, వేదాంత నిపుణుల స్తుతి అది. ఆరాధన అది. చేతులెత్తి వారికి నమస్కరిస్తున్నారు. ఏక కంఠంతో వారికి నివాళు లర్పిస్తున్నారు. శాస్త్రిగారు కూడానా..?

"అలా జంకుతూ నిలబడకు తాయారూ? వెళ్ళి నువ్వూ వాళ్ళ మధ్య కూర్చో, ఇక్కడ మాకు మత విభేధాలూ, కలహాలు, కులాలు, వాటి తాలూకు అహంకారాలూ లేవు. అందరం ఒకే చోట కలిసి కూర్చుని భోంచేస్తాము, ప్రార్థిస్తాము. మా జీవిత విధానం వేరు. మా విలువలు, ఆలోచనా పరంపరలు వేరు. భయపడకు. ఆశ్చర్యపడకు.. మాతో కలిసిపో" ఎవరో వెనుకనుంచి నెమ్మదిగా అంటున్నారు.

తాయారు చదువు చిన్నప్పుడు బాగా సాగలేదు. బి.ఎ పూర్తి చేయకముందే వివాహమయింది. తనకి డిగ్రీ లేదనీ, జీవితంలో అదొక పెద్ద లోటనీ తాయారు నిత్యం చింతించేది. తను జీవితంలో ఎదుర్కొనే కష్టాలకి చదువు లేమి కారణమని భావించేది. అటువంటి తాయారుకి ఎదురయ్యారు అక్కడ మూర్తి మేష్టారు. ఆయన్ని చూడగానే తన బాల్యం జ్ఞాపకానికి వచ్చింది తాయారుకి. ఆమెని ఆదరంగా పలకరిస్తూ మేష్టారు ఇలా అన్నారు..

" ఏం తాయారమ్మా! చదువు విషయం ఇంకా నిన్ను బాధిస్తోందా? నేను ఒక గొప్ప విషయం కనుక్కున్నాను. నువ్వు నా ప్రియ శిష్యురాలివి కనుక నీతో ఆ సత్యం పంచుకోదలిచాను. చూడమ్మా! డిగ్రీలు పొందడం, తర్ఫీదులు అవటం, తెలివితేటలు వెల్లడించడం అంత కష్టంకాదు. మానవత్వం పెంపొందించుకోవడం చాలా ముఖ్యం. ఎన్నడైనా గమనించావా తల్లీ! మన శాస్త్రజ్ఞానం ఎంతో పురోగమించినా సామాన్యమైన రోగాలకి మందులు కనిపెట్టలేక పోతున్నారు. అబద్ధాలు చెప్పడం, మోసాలు చేయడం, దొంగతనాలు చేయడం, అహంకారం, దర్పం ప్రదర్శించడం- ఇవన్నీ కూడా మనుషులకి సామాన్యమైన జబ్బులు. కానీ, ఆశ్చర్యం! ఈ రోగాల నివారణకి మందులు లేవు. ఎంతసేపూ క్యాన్సరు.. క్షయ.. అంటూ పరిశోధనలు జరుగుతున్నాయి.

"కరుణ, దయ, ప్రేమ, క్షమాగుణం - యిలాటివేమీ మనకు నేర్పేవారు లేరు. వాటిని మనం స్వయంగా అలవరుచుకొని ఇతరులకి పంచాలి. అదే జీవి తెలుసుకోవలసిన పరమ రహస్యం. జ్ఞానమంటే అదే తల్లీ!" మూర్తి మేష్టారు ముగించారు.

తాయారు చేతులెత్తి ఆయనకి నమస్కరించింది. పాటలు వినవస్తున్న వైపు నెమ్మదిగా అడుగులేసుకుంటూ వెళ్ళి వారిని చేరుకుంది.